



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 4-12-2024

సంపుటి: 20 సంచిక: 213

పేజీలు: 4 వెల: రూ.1







## సొంతవారికి సాయపడి గట్టి మేల్ తలపెట్టవోయ్!

- ఇసుక రీచ్‌లు కట్టబెట్టడంలో లోకల్ ఫీలింగ్ చూపిస్తున్న మైన్స్ డీడీ
- నాలుగు ర్యాంపులకు నిలిచిపోయిన ఫైనాన్షియల్ క్లియరెన్స్
- గోపాలపెంట దందాపై కలెక్టర్ ఆగ్రహం
- కొత్త టెండర్లు కట్టబెట్టకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఆదేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చిరంజీవి నటించిన ఇంద్ర సినిమాలో కాశీకి వచ్చిన భక్తులను మీది తెనాలి, మాది తెనాలి అంటుంటాడు బ్రహ్మానందం. అంతకు ముందే మనం మనం బరంపురం అనే నానుడి పుట్టింది. అంటే.. దానర్థం వడ్డించేవాడు మనవాడైతే చివరి పంక్తిలో కూర్చున్నా భోజనం అందుతుందన్నట్టు మాట. ఇప్పుడు ఇదే సూత్రాన్ని వర్తింపజేస్తున్నారు జిల్లా మైన్స్ అధికారులు పైనుంచి నిజంగా ఒత్తిడి వస్తుందా? లేదూ అంటే తన ప్రాంతం వారికి మేలు చేయాలన్న కోరికో తెలీదు గానీ జిల్లాలో ఇసుక ర్యాంపులను గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చెందినవారికి కట్టబెట్టడానికి ఎడతెరిపి లేకుండా

- మిగతా 4లో








• ఎడిటోరియల్

## మనమెందుకు అంతమందిని కనాలి?

కొంతమంది నాయకులు జనాభా గురించి వర్రీ అవుతున్నారు. వాళ్లు బాధపడేది అధిక జనాభా గురించి కాదు.. జనాభా పెరుగుదలలో ఇండియా చైనాను మించిపోతోందని కాదు.. జనాభా ఇంకా పెరగాలంటున్నారు. కొందరు పొలిటికల్‌గా మాట్లాడుతుంటే, కొందరు సమాజం గురించి మాట్లాడుతున్నారు. జనాభా నియంత్రణ, దాని ద్వారా ఎదురయ్యే పరిణామాల గురించి చాలా కాలంగా తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు ఏదో ఒక రూపంలో తమ స్వరాన్ని వినిపిస్తూనే ఉన్నాయి. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా మాట్లాడుతున్నారు. ముఖ్యంగా డీలిమిటేషన్ అంటే నియోజకవర్గాల పునర్విభజన ప్రస్తావన వచ్చినప్పటి నుంచి ఇది ఇంకాస్త పెరిగింది. అమరావతిలో ప్రజలు వృద్ధులు అవుతున్నారని, రాష్ట్రానికి అదొక సమస్యగా మారనుందని చంద్రబాబు అన్నారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనాలని మరొకసారి పిలుపునిచ్చారు. ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలను కనకుంటే స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి 'అనర్హులుగా' చేస్తూ చట్టం కూడా తీసుకొస్తామన్నారు. స్టాలిన్ అయితే మరో అడుగు ముందుకేసి ఒక్కో జంట పదహారుమంది పిల్లలను ఎందుకు కనగూడదు అని ప్రశ్నించారు. జనాభా నియంత్రణ మీద చంద్రబాబు నాయుడు, స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేయడం ఇదే తొలిసారి కాదు. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్ వల్ల నష్టపోతాయనే ఆందోళన ఎప్పటి నుంచో ఉంది. కేంద్రం, జనాభా ఆధారంగా నిధులను రాష్ట్రాలకు పంచడం మీద ఎంతో కాలంగా దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యమంత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజింగ్ గురించి చంద్రబాబు ప్రస్తావించగా, పార్లమెంటులో ప్రాతినిధ్యం గురించి స్టాలిన్ మాట్లాడారు. తాజాగా ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ కూడా ప్రతి కుటుంబం ముగ్గురు పిల్లలను కనాలని అన్నారు. జనాభా తగ్గడం వల్ల చివరకు సమాజమే అంతరిస్తుందని అన్నారు. జనాభా తగ్గడం వల్ల భాషలు అంతరిస్తాయని, సంస్కృతి నశిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధుల జనాభా పెరుగుతోంది అంటే.. పని చేసే జనాభా తగ్గుతోందని అర్థం. ఇది ప్రధానంగా మానవ వనరుల కొరతకు దారితీస్తుంది. సౌత్ కొరియా, చైనా, జపాన్ వంటి దేశాలు ఇప్పటికే ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. పెళ్లి చేసుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహకాలను సౌత్ కొరియా ప్రకటించింది. జపాన్ అయితే మ్యారేజ్ బడ్జెట్ కేటాయించింది. దక్షిణాదిలో జనాభా పెరుగుదల ఆగిపోవడం వల్ల పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెబుతోంది అదే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకల్లో పెరిగే జనాభా 2.9 కోట్లు. అంటే ఇది మొత్తం పెరిగిన జనాభాలో కేవలం 9శాతం. జనాభా సంఖ్యను బట్టే అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య ఉంటుంది. ఆ సంఖ్య తగ్గితే రాజకీయ బలం తగ్గిపోతుంది. ఎక్కువ సీట్లు ఉన్న రాష్ట్రాలు తమ డిమాండ్లు సాధించుకోవడంలో ముందుంటాయి. నాయకులు ఎక్కువమంది పిల్లలను కనాలని చెబుతున్నారుగానీ అది సాధ్యమయ్యే పనికాదు. పాత కాలంలో ఒక్కో కుటుంబంలో పది మంది పిల్లలకంటే ఎక్కువ మంది సంతానం ఉండేవారు. ఆ కాలంలో జీవన వ్యయం తక్కువ కాబట్టి ఎలాగోలా కష్టపడి పోషించారు. కానీ ఈ కాలంలో అది సాధ్యం కాదు. ఇప్పుడు కాస్ట్ లివింగ్ పెరిగిపోయింది. ఈ ఆధునిక కాలంలో ఎక్కువమంది ఒక్క సంతానంతో సరిపెడుతున్నారు. ఎక్కువమంది పిల్లలను కనాలని చెబుతున్న చంద్రబాబుకు ఎంతమంది పిల్లలు? మోహన్ భగవత్ గాని, చంద్రబాబు గాని చెప్పినదాంట్లో వాస్తవం లేకపోలేదు. కాకపోతే దేశంలో లక్షలాది అఘోరాలకు, సన్యాసులకు ఈ మాట చెప్పి ఆదర్శంగా నిలవాలి. ముఖ్యంగా మనం తొమ్మిది నెలలు మొయ్యం. ప్రాణాలు పణంగా పెట్టి బిడ్డను కనం. మురికి, మూత్రాదులు ఎత్తిపోసి పెంచం. ముఖ్యంగా వాళ్లకు తిండి, తిప్పలు, చదువు, బట్టలు ప్రభుత్వాలు కల్పించవు. ఇవన్నీ కల్పిస్తున్న అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఎవరూ కనం పొమ్మంటున్నారు. ఈమధ్య కాలంలో డింగ్ అనే ఒక విధానం అవలంభిస్తున్నారు. డబుల్ ఇన్‌కమ్.. నో కిడ్స్. మనకు మాత్రం రోడ్లేయడానికి, కాలువలు ఎత్తడానికి, కూరగాయలు అమ్మడానికి, వ్యవసాయం చేయడానికి, పరిశ్రమల్లో పని చేయడానికి జనం కావాలి. వారిలో మతం గొడవలు రెచ్చగొడుతూ పరిపాలించడానికి, పన్నులేయడానికి, ఫలానా తిండి తిన్నారని, ఫలానా బట్టలేసుకున్నారని చంపేయడానికి అమాయక జనం కావాలి. ఆధిపత్య కుల సంస్కృతిని బతికించడానికి నిరంతరం బానిసత్వంలో బతికే జనం కావాలి.



కొణిజేటి రోశయ్య.. తను క్రౌడ్‌పుల్లర్ కాదు. వ్యక్తిగత చరిష్మాతో రాజకీయాల్లోకి నెగ్గుకొచ్చినవాడు కాదు.. కొన్ని పద్ధతులు, విలువల్ని తనే నిర్దేశించుకుని ప్రస్తుత రాజకీయ అవలక్షణాల్ని దగ్గరకు రానివ్వకుండా తెలుగు రాష్ట్రాల పాలనపై తనదైన ముద్ర వేసిన వాడు. ఒక ముఖ్యమంత్రిగా జస్ట్, ఓ టెంపరరీ, టైమ్ బీయింగ్ అడ్జస్ట్‌మెంట్ కావచ్చుగాక.. కానీ ఓ ఆర్థికమంత్రిగా ఓ సుదీర్ఘ అనుభవం.. ప్రావీణ్యం.. ఇప్పుడంతా పంచుడు రాజకీయం కదా.. అదే బటన్ డిస్ట్రిబ్యూషన్ కదా.. కానీ రోశయ్య పదేపదే చెప్పేవాడు ఓ మాట.. 'ఏట్లో వేసినా ఎంచి వేయాలి'..

# రోశయ్య.. ఓ పొలిటికల్ స్పాంటేనియస్ట్!

అంటే..దానికి లెక్క ఉండాలి, లెక్క ప్రకారం పంచాలి, దానికి ఓ సార్థకత ఉండాలి అని భావం. తెలుగు రాజకీయాల్లో తనకు ఓ ప్రశంసాపూర్వక గుర్తింపు ఉంది. అది వ్యంగ్యం కలిపిన రాజకీయ విమర్శ.. వర్తమానంలో గానీ, మన తెలుగు రాష్ట్రాల్లో గతంలో గానీ ఎవరికీ ఈ లక్షణం లేదు, అదంత సులభమూ కాదు.. ఐనా ఇప్పుడంతా రండ, బోసిడికె, నాకొడకా, బట్టెబాజ్, బాడ్‌కావ్, తాటతీస్తా తరహా బూతుల భాషే కదా.. సంస్కారం మత్తళ్లు దూకే భాష.

నిజానికి వ్యంగ్యం రంగరించి కొడతే ఆ రాజకీయ విమర్శలో ఉండే పదును వేరు, పంచ్ వేరు.. తను మరణించినప్పుడు, అంత్యక్రియల్ని తనను ఓన్ చేసుకున్నట్టు నటించే వైశ్య సంఘాలు గానీ, ప్రభుత్వం గానీ ఏమీ పట్టించుకోకపోయినా సరే ఇప్పుడు హఠాత్తుగా వైశ్య సంఘాలకు రోశయ్య గుర్తొచ్చాడు. సంతోషం.. ప్రభుత్వమూ ప్రాధాన్యమిస్తున్నది.. గుడ్..

విమర్శకు ప్రతి విమర్శ పదునుగా ఉంటే..తనను ఎదుర్కోలేక నాటి ముఖ్యమంత్రి ఏకంగా మండలినే రద్దు చేశాడని చెప్పుకుంటారు. ఒకటీ రెండు ఉదాహరణలు చెప్పుకుంటే చాలు..

ఓసారి అసెంబ్లీలో సీరియస్ చర్చ.. ఎప్పట్లాగే టీడీపీ సభ్యులు రోశయ్య మీద దాడి స్టార్ట్ చేశారు. రోశయ్యకు తెలివితేటలు మరీ ఎక్కువయ్యాయంటూ వెటకారాలు మొదలెట్టారు..

దానికి ఆయన సమాధానం ఇస్తూ ఇలా అన్నాడు.. “నాకు అన్ని తెలివితేటలే ఉంటే ఇలా ఎందుకు ఉండిపోతాను..? అంత తెలివే ఉంటే నన్ను నమ్మిన వైఎస్‌ను వెనుక నుంచి ఒక్క పోటు పొడిచి సీఎం కుర్చీ ఎక్కేవాడిని.. అంతకుముందు చెన్నారెడ్డిని పొడిచేవాడిని.. విజయ భాస్కర్‌రెడ్డిని పొడిచేవాడిని..”


టీడీపీ వైపు నుంచి ఒక్కరైనా కిక్కుమంటే ఒట్టు.. రోశయ్య 2004-09 కాలంలో ఆర్థికమంత్రిగా ఉన్న రోజుల్లో ఆయన అల్లుడు వైజాగ్‌లో ఓ క్లబ్‌లో పేకాడుతూ క్యాబరే చూస్తూ పోలీసులకు దొరికిపోయాడట. దీని మీద అసెంబ్లీలో చంద్రబాబు& టీడీపీ ఎమ్మెల్యేలు అర గంట పాటు రచ్చరచ్చ చేశారు. ఆ తర్వాత మెల్లగా లేచిన రోశయ్య స్పీకర్ తో ఇలా అన్నారు.

'అధ్యక్షా, ఏం చేస్తాం.. ఆ భగవంతుడు ఎన్టీ రామారావుకు నాకు మంచి అల్లుళ్లను ఇవ్వలేదు.. అన్నారు. అంతే దెబ్బకు టీడీపీ సైలెంట్..

కుటుంబ నియంత్రణ గురించి జరిగే చర్చలో చంద్రబాబు మాట్లాడుతూ గంపెడు పిల్లలున్న మీరేం మాట్లాడతారు కుటుంబ నియంత్రణ గురించి అంటూ వ్యంగ్యంగా అనడంతో రోశయ్య ఇచ్చిన సమాధానం దిమ్మదిరిగేలా చేసింది. ఒక్క సంతానం ఉన్న బాబు కు కుటుంబ నియంత్రణ ఆవశ్యకత తెలియకపోవచ్చు కానీ అధిక సంతానం ఉన్న కుటుంబ యజమానిగా ఆ బాధలు నాకు తెలుసు అంటూ తిప్పికొట్టడంతో అందరూ బల్లలు చరిచారు.

మీకు రెండో ఫ్యామిలీ ఉందట కదా అని ఒక విలేకరి అడిగితే ' బాబ్బాబు కొంచెం అడ్రెస్ చెప్పవా ' అని ఆయన రిటార్ట్. నేనెప్పుడూ డ్రామాలు వెయ్యలేదు.. కనీసం డ్రామాలో కత్తి పట్టుకొని వెనుక నిల్చుని వేషం కూడా వేయలేదు అని ఆన్సర్ ఇచ్చాడు. రోశయ్య ఇంకో సూపర్ డైలాగ్.. అసెంబ్లీలో టీడీపీ వ్యక్తి ఏదో విషయమై సవాలు చేస్తే, “బాబూ! మీ అంత శక్తి లేదు. మీలాగా నేను తొడ కొట్టి మెరుపులు సృష్టించలేను. నా తొడ వాచిపోతుంది.” ఆది (సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ తొడగొడితే ఆకాశంలో మెరుపులు వస్తాయి. అది చాలా పాపులర్ & ఫన్నీ కూడా..) అవి దృష్టిలో పెట్టుకొని రోశయ్య కౌంటర్ అది) చెబుతూ పోతే ఇలాంటివి ఎన్నో.. అప్పటికప్పుడు స్పాంటేనియస్‌గా!!

- ముచ్చట సౌజన్యంతో...



గోల్

ఏం లేదు. బతకడానికి ఎక్కడవకాశం దొరికితే అక్కడ పని చేస్తూ వచ్చాడు. కానీ, చివరకు నటనలో మాత్రం విభిన్నమైన శైలిని కనబర్చాడు. కొన్ని పాత్రలు అనుకున్న స్థాయిలో కుదరాలంటే.. వాటిని తాను మాత్రమే చేయగలనని నిరూపించాడు. అలా ఒక వెయిటర్ నుంచి.. స్పోర్ట్స్ ఫోటోగ్రాఫర్ గా.. అక్కడి నుంచి బాలీవుడ్ వైవిధ్య నటుడిగా ఎదిగిన బొమన్ ఇరానీ పుట్టినరోజు (డిసెంబర్ 2) అందుకే, అతగాడి గురించి ఓ నాల్గు మాటలైనా చెప్పుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సినిమా నటీనటులుగా ప్రయత్నించేవాళ్లెందరో యుక్తవయస్సు నుంచి చిన్నా చితకా పాత్రలతో ఎన్నో ఏళ్లు గడిస్తేనేగానీ ఒక దశకు చేరు కోలేరు. కానీ, దాదాపు నడివయస్సులో అంటే 44 ఏళ్లకు సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి.. మున్నాభాయ్ ఎంబీబీఎస్, 3 ఈడియట్స్ వంటి సినిమాల్లో నటనతో తనెందుకు భిన్నమైన నటుడో తెలియజెప్పాడు. వీరూ సహస్ర బుద్ధి పేరుతో 3 ఈడియట్స్ షార్ట్‌గా వైరస్ అని పిల్చుకున్న బొమన్ ఇరానీ నటనను చూసి ఆహా అనకుండా ఉండేవారెందరు..?

నటనలోకి ఆలస్యంగా ప్రవేశించినప్ప టికీ.. ఏనాడూ తన కమిట్‌మెంట్ నుంచీ, తన వృత్తిపైనున్న ఫోకస్ నుంచి మాత్రం పక్కకు తప్పుకోలేదు. తండ్రి చనిపోయిన ఆర్నెల్ల తర్వాత పుట్టాడు. మగ పురుగు కని పించని ఇంట్లో ఆడవాళ్ల మధ్యే ఒంటరి పురుషుడన్నట్టు పెరిగాడు. చిన్ననాటే చదవడం, మాట్లాడ్డం, రాయడం సరిగ్గా రాని డైస్లెక్సియా బారినపడ్డాడు. అలా ముభావమైన పిల్లాడిగానే పెరిగాడు.జస్ట్ లైక్ 3 ఈడియట్స్ సినిమాలో వైరస్ తరహాలోనే చిన్ననాట మాట్లాడితే అంతా ఆట పట్టించేవారట బొమన్ ని. ఒకింత ఆతృత, అత్యుత్సాహంతో మాట్లాడటంతో తప్పులు దొర్లి.. చాలా అరుదుగా మాట్లాడటం చేసేవాడు బొమన్. తాను 7వ తరగతికొచ్చే 12 ఏళ్ల వయస్సు వరకూ తానెక్కువ మాట్లాడకపోయేవాణ్నంటాడు. ఓరోజు తన ప్రవర్తనతో మిషనరీ స్కూల్ ఫాదర్ బొమన్ ని అనర్హుడిగా ప్రకటించి ఇంటికి పంపించేశాడు. కానీ, ఆ ఫాదర్ కు ఏమనిపించిందో ఏమో.. మళ్లీ ఆయనే వారం తర్వాత పిలిపించి తిరిగి అడ్మిషన్ ఇవ్వడంతో పాటు, బొమన్ లోని ది బెస్ట్ ఏంటో దాన్ని బయటకు తీస్తామని తన తల్లికి హామీ ఇచ్చి పంపించేశాడట.

# వెయిటర్ నుంచి వర్సటైల్ యాక్టర్.. గమ్మత్తైన ప్రయాణం!

ఎలాగోలా కష్టపడి ఎస్సెస్సీ పూర్తి చేసిన బొమన్.. ఆ తర్వాత కాలేజ్ చదువులకు పూణేలోని వాడియా కళాశాల వైపు అడుగులేశాడు. కానీ, తాను ఇంజనీరో, డాక్టరో కావాలన్న కలలేనాడూ కనలేదు. ఎందుకంటే, తన సత్తా ఏంటో తానెంత మాత్రం చదువగలడో తనకు తెలుసు. అలా ఆర్ట్స్ వైపు మనసు తిప్పుకున్న బొమన్ కు తాను వెయిటరైతే బెటరేమో అనిపించింది. అలా హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొంది.. అమ్మమ్మా నేను వెయిటర్ కావాలనుకుంటున్నాని చెప్పాడు.

ఇంకేం కట్ చేస్తే ముంబై తాజ్ హోటల్‌కు ఇంటర్వ్యూకు వెళ్లాడు. బాస్ బొమన్ అర్హతల గురించి అడిగి తెలుసుకున్నాడు. హోటల్‌లో ఏం చేయాలనుకుంటున్నావనడిగాడు. దానికి సమాధానంగా కస్టమర్స్‌కు ఫుడ్ అండ్ డ్రింక్స్ డెలివరీ అని చెప్పాడు. అసలు హోటల్ ఉండే అందుకు కదా.. అంతకుముందు నువ్వెక్కడ చేసేవాడివనడిగాడు.. దానికి తాను అంతకుముందు పనిచేసిన ఓ హోటల్ పేరు చెప్పాడు. దానికి ఓహో.. ఒకేసారి పైకెదగాలనుకుంటున్నావా ఫూల్.. నువ్వు ముందు కింది నుంచి ప్రారంభించంటూ.. హోటల్ రూమ్స్ సర్వీస్ మ్యాన్‌గా ఉద్యోగమిచ్చాడు. అలా అక్కడ రెండేళ్లు పనిచేశాడు బొమన్. అక్కడి ఉద్యోగంలో కష్టపడి సంపాదించిన డబ్బును పైసా పైసా కూడబెట్టి బ్యాంకులో వేసుకున్నాడు.

ముంబైలోని రెస్టారెంట్స్‌లో పనిచేశాక.. చిన్నగా తన కుటుంబీకులతోనే కలిసి గుజరాతీ ఫలహారాలమ్మే ఓ స్వగృహ ఫుడ్స్ వంటి సెంటర్‌ను ప్రారంభించాడు. 25 ఏళ్లకు పెళ్లైంది. 26 ఏళ్లకు తండ్రయ్యాడు. పెళ్లై ఏడేళ్లు గడిచిపోతోంది. లైఫ్ దానికదే సాగిపోతోంది. ఎందుకో ఒకింత గిల్టీగా ఫీలైపోయిన బొమన్.. తన దగ్గర ఉన్న సేవింగ్స్‌తో ఓ ప్రొఫెషనల్ స్టిల్ ఫోటో కెమెరా కొనుగోలు చేశాడు. మెల్లిగా స్పోర్ట్స్ ఫోటోగ్రఫీ చేయడం మొదలెట్టాడు. అలా క్రికెట్, బాస్కెట్‌బాల్ ఆడే యువకుల ఫోటోలను తీస్తూ వాళ్ల తల్లిదండ్రులకు ఒక్కో ఫోటోను 25 రూపాయలకొకటి చొప్పున అమ్మేవాడు. అలా కొంత డబ్బు సంపాదించుకోగల్గాడు. మెల్లిగా అప్పటివరకూ తనకున్న కొన్ని అప్పులనూ తీర్చేశాడు.

ప్రముఖ కొరియోగ్రాఫర్ షియామక్ దేవర్ ను ఓ స్టూడియోలో కలిసిన సందర్భంలో వారు లంచ్‌కు బయటకు కలిసి వెళ్లే ఓ సందర్భం వచ్చింది. అక్కడ ఆలిక్ పదమ్సీని కలిశాక.. ఆయన ఓ పాత్రలో నటించమని బొమన్ కు ఆఫర్ ఇచ్చాడు. ఆ థియేటర్ షో ఫ్లాప్ అయినప్పటికీ.. ఇరానీకిచ్చింది జస్ట్ రెండున్నర నిమిషాల పాత్రే అయినప్పటికీ.. తన పాత్ర మాత్రం హిట్ టాక్ కొట్టేసింది. దాంతో మరో నాటకంలో ఐ యామ్ నాట్ బాజీరావ్ అనే పాత్ర దొరికింది. 75ఏళ్ల ఆ పాత్రను 150మంది ఆడిటోరియంలో ప్రదర్శిస్తే.. బొమన్ కు 200 రూపాయలు పారితోషికమిచ్చారు.

ఆ తర్వాత ఓ సినిమా ఆఫర్ వచ్చినా బొమన్‌కు అదీ కుదరకుండా పోయింది. కానీ అప్పటికే థియేటర్ ఆర్టిస్ట్‌గా విధూ వినోద్ చోప్రా కళ్లల్లో పడ్డ బొమన్ దశ ఇక అక్కడి నుంచీ మారిపోయింది. ఓరోజు డిన్నర్‌కు తన వెంట బొమన్‌ను తీసుకెళ్లి.. ఆ తర్వాత రెండు లక్షల రూపాయల చెక్ చేతికిచ్చాడు. ఇంతెందుకు సార్ నాకు అంటే.. నెక్స్ట్ ఓ సినిమాలో మీరు నటించబోతున్నారని బదులిచ్చాడట విధూ వినోద్ చోప్రా. అదే ఆ తర్వాత భాషలకతీతంగా ప్యాన్ ఇండియా సినిమాగా హిట్టై.. ప్రాంతీయ భాషల్లోకీ రీమేక్స్ అయి సంచలనం సృష్టించిన మున్నాభాయ్ ఎంబీబీఎస్. ఇంతకీ ఆ సినిమాలో తన పాత్రేంటని అడిగితే డీన్ అని చెప్పగానే.. ఏం చేయాల్సి ఉంటుందన్నాడట బొమన్..? ఏం లేదు జస్ట్ నవ్వుకుంటూ ఉండటమే ఆ పాత్ర అని బదులిచ్చాడట విధూ వినోద్ చోప్రా.

సినిమా సూపర్ హిట్. తనకు సహాయ నటుడి అవార్డ్ దక్కింది. ఆ స్టేజ్ పై ధరించేందుకు ఓ సూట్ కావాలి. అప్పుడు వచ్చాడు అర్షద్ వార్సీ. తన రెగ్యులర్ టైలర్‌కు చెప్పి బొమన్‌కు ఓ సూట్ కుట్టించాడు. ఆ బ్లాక్ సూట్ వేసుకున్న బొమన్.. ది బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ మేల్ గోస్ టూ బొమన్ అనేసరికి ఆ స్టేజ్ పైకొచ్చే క్రమంలో తట్టుకుని కింద పడిపోయాడు. చేతికి గాయం కూడా అయింది. తన జీవితంలో మురికిలాగే.. తన సూట్‌కూ మురికి అంటుకుంది. అయినా, ప్రేమ్ చోప్రా చేతులమీదుగా ఆ అవార్డ్ అందుకున్న మధురక్షణాలు.. మర్చిపోలేనివంటాడు బొమన్. ఇక ఆ తర్వాత బొమన్ వెనక్కి తిరిగి చూడలేదు. ఒక త్రీ ఈడియట్స్ చాలు తన కెరీర్ మొత్తంలో ది బెస్ట్ అని చెప్పడానికి. మై హూ నా, లగే రహో మున్నాభాయ్, దోస్తానా వంటి అనేక సినిమాల్లో బొమన్ కోసమే ప్రత్యేక పాత్రల చిత్రణ తయారైంది. వయస్సొక ఒక సంఖ్య మాత్రమేనని.. తన వైవిధ్యమైన పాత్రలతో నిరూపించాడు.. మీరు ఇష్టపడేదాన్ని చేయాలనుకుంటే ఎప్పుడైనా ముందడుగు వేయొచ్చని చాటాడు. తనంత కమిట్మెంట్‌తో చేస్తే నిల్చిపోవచ్చనీ తన నటనతో ప్రకటించేశాడు. ఇప్పుడు తను జీవితం ప్రారంభించిన స్టార్ హోటల్ రూమ్స్ లోనే పేరు మోసిన నటుడి హోదాలో ఆతిథ్యం స్వీకరిస్తున్నాడు.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో..



'బాంచన్ దొరా... జర పనియ్యండి...' అని అడిగిన. ' కుంటోడ్నివి నువ్వేం పని చేస్తవ్‌రా, పోయ్ అడుక్కో పో..' అన్నారు దొరలు. వారికో దణ్ణం పెట్టి, నాంపల్లి టేషన్ కాడ నాలుగేండ్లు బిచ్చమెత్తి బతికినా... తరువాత సికింద్రాబాద్ స్టేషన్‌కి షిఫ్ట్ అయి మరో రెండేళ్లు అలాగే అందరి ముందు చేతులు చాచి బతికా...' అని ఆగాడు యాద్గిరి. అలా ఎంత కాలం ఇతరుల ముందు చేయి చాచి బతకాలి. సొంత గ్రామా నికి వచ్చి ఎక్కడో గుట్టల కింద ముళ్ల పొదలతో బంజరుగా పడి ఉన్న తాతల నాటి తన నేలను వెతికి సాగులోకి తెచ్చాడు. ఆ విశేషాలే ఈ కథనం.



# రైల్వేస్టేషన్‌లో యాచకుడు.. రైతయ్యాడు!

ఇద్దరం మామిడి చెట్ల కింద జొన్నరొట్టెలు తింటున్నాం. టిఫిన్ బాక్స్‌లో ఉన్న చికెన్ కర్రీ వడ్డించి 'మీరు వస్తున్నారని తెలిసి మా ఇంటామె చేసింది. తినండి సార్? మా దగ్గర కల్లు బాగుంటది తెప్పిద్దాం అనుకున్నా మీరు తీసుకుంటారో లేదో అని ఆగాను." అని అన్నా డు . ఇద్దరం వరి పొలంలో పారుతున్న నీళ్లతో చేతులు కడుక్కున్నాం. ఆ దృశ్యాన్ని కట్ చేస్తే... ఇప్పుడు సిద్దిపేట శివారులో నాలుగెకరాలు భార్యతో కలిసి, కుంటుతూ వ్యవసాయం చేస్తున్నాడు. వరి పంటలను యంత్రాలతో హార్వెస్ట్ చేస్తున్నాడు. నాలుగెకరాల్లో వరి,మామిడి పండ్లు పండిస్తున్నాడు. పండ్ల వ్యాపారులకు పెట్టుబడి అయ్యాడు, నలుగురు కూలీలకు బతుకు తెరువయ్యాడు, ఊరికి విజయ కేతనమయ్యాడు. అదెలా జరిగిందో చదవండి...



ఇరవై ఆరేళ్ల క్రితం, మెదక్ జిల్లా ఖాతా గ్రామంలో చుట్టూ కరవు. వర్షాలు లేవు, వ్యవసాయం లేదు, పంటలు లేవు, బతకడానికి పనులు లేవు. ఇద్దరు పసి బిడ్డలు, భార్యకు అన్నం ఎలా పెట్టాలో కట్కూరి యాద్గిరికి అర్థం కాలేదు. అవిటి తనం వల్ల అతడికి ఎవరూ పనిచ్చేవారు కాదు. అంగవైకల్యం అతడి జీవనోపాధికి శాపమయింది. ఊరుని వదిలేసి హైదరాబాద్ చేరుకొని యాచకుడిగా మారాడు. ఆరేళ్లు అలాగే బతికేశాడు... కానీ, ఏ పని చేయకుండా, ఎంత కాలమిలా అందరి ముందూ చేతులు చాచాలని, మానసిక సంఘర్షణకు లోనయ్యేవాడు.

ఏదో ఒకటి సొంతంగా పనిచేసుకోవడంలోనే తృప్తి ఉందని భావించాడు. వెంటనే తన స్వగ్రామం 'ఖాతా' (నంగునూరు మండల్, సిద్ధిపేట)కు వచ్చేశాడు.

భూమి కోసం వెతికాడు... ఏనాడో తన తల్లికి సర్కారిచ్చిన రెండెకరాల భూమి ఉందని విన్నాడు, కానీ అది ఎక్కడ ఉందో కూడా తెలియదు. అధికారుల చుట్టూ తిరిగి, ఆ నేల సరిహద్దులు తెలుసుకున్నాడు. కానీ దానిని చూడగానే అతడి భార్య గాబరా పడింది. కొండరాళ్లతో ముళ్లకంపలతో దారీ తెన్ను లేక బంజరుగా పడి ఉన్న ఆ నేలను ఎలా చదును చేయాలో తోచక ఆ భార్యాభర్తలు ఆందోళన చెందారు. దానికి తోడు చుట్టు పక్కల వారు వారిని నిరాశపరిచారు. కాలు,చెయ్యి బాగు న్నోళ్లే పొలం పనులు చేయలేకున్నారు, అవిటోడి ఎలా దున్నుతాడు అని హేళన చేశారు. ఇవన్నీ తట్టుకోలేక ... అసలా భూమిని అమ్మేసి కిరాణా షాపు పెట్టుకుందామని యాదగిరి ప్రయత్నం చేశాడు. కానీ ఆ భూమిని కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఎందుకంటే, అది సాగుకు ఏమాత్రం అనువుగా లేదు, సాగునీరు లేదు. అయినప్పటికీ యాదగిరి నిరాశ పడలేదు. అదే సమయంలో ఆ ఊర్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు మొదయ్యాయి. సాధారణ కూలీగా జాబ్ కార్డు పొంది వికలాంగుల సంఘంలో చేరి వంద రోజులు పని చేసి కొంత ఆదాయం పొందాడు. దాంట్లో కొంత పొదుపు చేసి, తన బంజరు నేలను తన భార్య పిల్లల సాయంతో చదును చేశాడు. 70 మామిడి మొక్కలను నాటి, కుండలతో నీళ్లు పోసేవాడు. కొమ్మలు విస్తరించ కుండా కట్ చేసి ఆకులను చెట్ల మొదళ్లలోనే వేసి సేంద్రియ ఎరువుగా మార్చేవాడు. ఒక బోరు వేస్తే పడలేదు. బావిని తవ్వడం మొదలు పెట్టాడు, సగం పని అయ్యాక రాయి తగలడంతో సగంలోనే ఆపేశాడు. అతని తపనను గుర్తించిన జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆ బావిని మరింత లోతు తవ్వడానికి సాయపడ్డారు. ఎట్టికేలకు బావిలో నీళ్లు పడ్డాయి. అక్కడే యాదగిరి జీవితం మలుపు తిరిగింది. నాలుగేళ్లలో మామిడి మొక్కలు, పండ్ల తోటలుగా మారాయి. మామిడి మొక్కలతో పాటు యాదగిరి బతుకు కూడా చిగురించింది.

అంతర పంటలుగా కూరగాయలు పండిస్తూ, రెండు పాడి పశువులను పెంచాడు. డ్రిప్ ఇరిగేషన్ చేస్తూ నీటిని పొదుపుగా వాడుతున్నాడు. ఆదాయం పెరిగింది. పొదుపుగా ఖర్చు పెడుతూ పైసా,పైసా కూడబెట్టి రెండు ఎకరాలు కొన్నాడు. చిన్న పొదరిల్లు వంటి సొంత ఇంటిని సమకూర్చుకున్నాడు.


తన తోటను, పక్కనే ఉన్న పొలం అంతా చూపించాడు. పండిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తూ,, " ఈ బంజరు నేలను చూసి మొదట్లో భయపడ్డాకానీ, కొంత ధైర్యం కూడగట్టుకొని దానిని సాగులోకి తెచ్చాను. డ్రిప్ కోసం అధికారుల చుట్టూ ఎన్నోసార్లు తిరగాల్సి వచ్చింది. చివరికి నా పట్టుదలను, అవిటితనాన్ని చూసి, మామిడి మొక్కలకు, బావికి, డ్రిప్‌కు ప్రభుత్వమే సాయం చేసింది. గత అయిదేళ్లుగా మామిడి పంట వస్తుంది. వరి రెండు పంటలు పండుతుంది. ఏడాదికి ఖర్చులన్నీ పోను 3 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. ఇద్దరు బిడ్డలు డిగ్రీ పూర్తి చేసి, సాగులో సాయం చేదోడుగా ఉన్నారు. ఇపుడు ఎవడి ముందూ తలవంచ కుండా బతుకుతున్నాను. నన్ను, నా అవిటితనాన్ని హేళన చేసినోళ్లే ఇపుడు గౌరవంగా చూస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి ఎందరో అధికారులు, మీ లాంటి జర్నలిస్టులు నా వ్యవసాయాన్ని అధ్యయనం చేయడానికి వస్తున్నారు." అన్నాడు చెమర్చిన కళ్లతో. యాద్గిరి భార్య కూడా వికలాంగురాలే... పొద్దుపొడవక ముందే భార్యతో, చంకలో కర్రతో మోపెడ్ పై పొలం వైపు దూసుకుపోతుంటాడు. అతని లక్ష్యం, పోరాట పటిమకు వరి కంకులు వంగి సలాం చేస్తుంటాయి. **- శ్యాం మోహన్**

## ప్రభుత్వ నిర్ణయం సరికాదు

(సత్యంన్యూస్, పాతపట్నం)



చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఏర్పాటు చేసి నెలలు గడవక ముందే పేద ప్రజలపై కక్షసాధింపు చర్యలు మొదలుపెట్టారని పాత పట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మంగళవారం పాతపట్నంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఒక ప్రకటన ద్వారా మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలమంది నిరుపేద ప్రజలకు సొంత గృహాలను ఏర్పాటు చేసుకోవడానికి స్థలాలను సైతం జగన్మోహన్ రెడ్డి ఉచితంగా ఇచ్చారని, కొన్ని కారణాలతో నేటికీ గృహాలు ప్రారంభం కాకుండా పేదల గృహాలు రద్దుచేయాలని చంద్రబాబు క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందని, ఇది సరైన నిర్ణయం కాదని ఆమె మండిపడ్డారు. నిరుపేదలపై కక్షసాధింపు చర్యలు చంద్రబాబుకి కొత్త ఏమీ కాదని ఇటువంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఏ ప్రభుత్వం చేయలేని విధంగా చరిత్రలో నిలిచే విధంగా పేదల కలలుగన్న ఇళ్లను మంజూరు చేసిన జగన్మోహన్ రెడ్డి చరిత్ర పుటల్లో నిలుస్తారని అక్కతో కూటమి ప్రభుత్వం ఇటువంటి తప్పుడు నిర్ణయం తీసుకుందని ఆమె అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు.



మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతుండడంతో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాటిరాజుల కూర్మారావు, వాడవలస సురేష్‌కుమార్, చిట్టి భాస్కరరావు, పల్లి శ్రీనివాసరావు, ముంగి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, శ్రీకాకుళం.**

## ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్టు వద్దు

(సత్యంన్యూస్, పలాస)



పచ్చదనంతో నిండిన ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దని ఉద్ధానం తీరప్రాంత భూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కొమర వాసు డిమాండ్ చేశారు. ఈమేరకు రైతు, మహిళా, విద్యార్థి, యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మందస మండలంలోని రాంపురం, భేతాళపురం, చీపురుపల్లి పంచాయతీలోని గ్రామాల రైతులకు సంఘీభావాన్ని ప్రకటించారు. గ్రామాలను పర్యటించి ఆందోళనలోఉన్న బాధిత ప్రజలకు మద్దతును తెలిపారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు సిహెచ్.వేణుగోపాల్, ఎస్.నారాయణ స్వామి, పి.ఆరేలమ్మ, కొన్న శ్రీనివాసరావు, సిహెచ్ రవి లు మాట్లాడుతూ ఏ అభివృద్ధి పనులను చేపట్టినా ప్రజలకు ప్రయోజనం, వారి ఆమోదం పరిగణనలోకి తీసుకుని పాలకులు ఆలోచన చేయాలన్నారు. ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని చేపట్టడం సరికాదని ప్రజలు తమ నిరసనలు తెలుపుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం గమనించాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలోని పలాస అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల సముద్రతీర ప్రాంతాలలోని సుమారు 13గ్రామాల ప్రజల భూభాగంలో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలను నిలుపుదల చేయాలని వారు కోరారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సముద్ర తీరంలోని ఈ ప్రాంతంలో ఎయిర్పోర్ట్ నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఎంపిక చేసి సుమారు 1400 ఎకరాల ప్రజల జీవనాధార భూముల్ని ప్రజల నుంచి కొనుగోలు చేసే యత్నాలకు పూనుకుంటున్నారనే సమాచారాన్ని తెలుసుకున్న ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రజల ఆమోదం లేకుండా ఈ కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణ చర్యలను చేపట్టడం సరైందికాదని వారు విమర్శించారు. ఉద్దానంలోని రైతులు, ప్రజలు తమ జీవనాధారాన్ని ధ్వంసం చేసె ఈ ఎయిర్పోర్ట్ నిర్మాణం వద్దని వ్యతిరేకిస్తూ పోరాట బాటను పట్టారని తెలిపారు. ప్రజల భూములకు నష్టపరిహారాన్ని లెక్కించడానికి బదులు ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేస్తున్నామనే స్పృహతో ప్రభుత్వం వ్యవహరించాలని సూచన చేశారు. ప్రజల ఆమోదంలేని ఇటువంటి నిర్మాణాలను ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటుకు ప్రయత్నాలను మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాందోళన ఉధృతం కాకముందే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఇప్పటికే సంబంధిత గ్రామాల ప్రజలు ఉద్యమబాట పట్టిన వైనాన్ని గమనించే ప్రజా సంఘాలుగా మేము వచ్చామని వారన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తీర ప్రాంత భూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కొమర వాసు, బాధిత రైతు నాయకులు చిత్త గున్నయ్య, ఎన్.పరుశురాం, మర్ల సంతోష్, డా.వై.యస్.ఆర్.ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబెర్ బత్తిని లక్ష్మణ్, గుంటు లోకనాథం, గుంటు రామస్వామి, దున్న హరికృష్ణతో పాటు పెద్దఎత్తున గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో లావేరు మండల హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్దతు ధర టన్నుకు రూ.117 రూపాయలు పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి సురేష్, పిన్నింటి మధుబాబు, తోటయ్యదొర, లుకలాపు అప్పలనాయుడు, రాజా పంతుల ప్రకాష్ రావు, మీసాల వెంకటరమణ, త్రినాధరావు, జనసేన దుర్గారావులు పాల్గొన్నారు.





స్థానిక శ్రీకాకుళం నగరంలో గల ప్రభుత్వ మహిళా కళాశాలలో ఉన్న వసతిగృహాల్లో పేరుకుపోయిన మురుగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ గారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్ మాట్లాడుతూ మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్న నాలుగు వసతిగృహాల్లో పేరుకుపోయిన మురుగునీరు వల్ల అక్కడ దాదాపుగా చదువుతున్న 800మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో దివ్య, ఖగేష్‌లు పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, శ్రీకాకుళం**















# మరోసారి నీటిసంఘాల ఎన్నిక వాయిదా

**కూటమి ప్రభుత్వం వచ్చాక ఇది మూడోసారి । అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు తీవ్రమైన పోటీ । ప్రోటోకాల్ పదవి తమకూ కావాలంటున్న బీజేపీ, జనసేన**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సాగునీటి సంఘాల ఎన్నికలు ఇప్పటికి మూడోసారి వాయిదా పడ్డాయి. ఈ నెల 5న విడుదల చేయాల్సిన ఎన్నికల నోటిఫికేషన్‌ను రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నవంబరు 21 జరగాల్సి ఉండగా, ఆఖరి నిమిషంలో వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వ నిర్ణయించడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు ముగియడంతో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించి ఈ నెల 5న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధమైంది. అంతలోనే మరోసారి వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వ ప్రకటించింది. చేతులెత్తే ప్రక్రియ ద్వారా నిర్వహించే సాగునీటి సంఘాల ఎన్నికల్లో వంశధార, నారాయణపురం ప్రాజెక్టులకు సంబంధించిన చైర్మన్, వైస్ చైర్మన్ పోస్టులు ప్రధానమైనవి. వీటిని తమవారికే దక్కేలా కూటమి పార్టీలు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించాయి. ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పదవులు వస్తే ప్రాధాన్యం ఉంటుందని భావిస్తున్న నాయకులు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. వంశధార, నారాయణపురం ప్రాజెక్టు కమిటీలకు చైర్మన్లుగా ఎన్నికయితే ప్రోటోకాల్‌తో పాటు వ్యవసాయ, నీటి సలహా మండలి, జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ, జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు హాజరయ్యేందుకు అవకాశం కలుగుతుంది. దీంతో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు కూటమి నేతలు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కూటమి నాయకులు సాగునీటి సంఘాల పదవులపై ఆసక్తి కనబరుస్తున్నారు. సాగునీటి సంఘాలకు రాజకీయ పార్టీలతో సంబంధం లేకపోయినా తమ పార్టీ నాయకులే పదవులు దక్కించుకునే కూటమి నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. 2014-19 కాలంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కేవలం టీడీపీ సానుభూతిపరులు మాత్రమే దక్కించుకోగా, ఇప్పుడు జనసేన, బీజేపీ కూడా అందులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాయి.

**ఓటర్ల జాబితాలు సిద్ధం**

జిల్లాలో వంశధార, నారాయణపురం వాటర్‌యూజర్స్ కమిటీలు, 21 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీటితో పాటు మైనర్ వాటర్ యూజర్ అసోసియేషన్లు 250, మేజర్ వాటర్ యూజర్ అసోసియేషన్లు 94 ఉన్నాయి. జిల్లాలో మీడియం వాటర్ యూజర్స్ అసోసియేషన్స్ ఏమీ లేవు. వీటిలో వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల చేసి 8న ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక సైతం అదే రోజున జరగనుంది. 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీ, 14న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలోని 30 మండలాల పరిధిలోని ఓటర్ల జాబితాలను ఇప్పటికే తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. జిల్లాకు సంబంధించి మొత్తం 4,57,954 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 3,42,594 మంది, మహిళా ఓటర్లు 1,15,360 మంది ఉన్నారు. ఓటర్లుగా నమోదైన రైతులంతా కలిసి వాటర్ యూజర్స్ అసోసియేషన్ (డబ్ల్యూయుఎ) సభ్యులను ఎన్నుకుంటారు. జిల్లాలో మేజర్, మైనర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీలో 12 మంది సభ్యులు ఎన్నికవుతారు. మైనర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్‌లో ఆరుగురు ఎన్నిక కానున్నారు. ప్రతి కమిటీ నుంచి ఎన్నికైన సభ్యులంతా అందులో ఇద్దరిని ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటారు. యూజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్లుగా ఎన్నికైన వారంతా జిల్లాలోని 21 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు సంబంధించిన ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ప్రెసిడెంట్లంతా కలిసి వంశధార, నారాయణపురం ప్రాజెక్టులకు సంబంధించిన చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ కమిటీల్లో ఈ రెండు ప్రాజెక్టుల కమిటీల వైస్‌చైర్మన్ కీలకమైనవి. వీటిని తమవారికే దక్కేలా కూటమి పార్టీలు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు. ఓటర్లు చేతులేత్తే ప్రక్రియ ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు. ఎక్కడైనా గందరగోళం ఏర్పడి ఎన్నిక జరగకపోతే ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయం ప్రకారం ముందుకు సాగుతారు. ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రకటించిన తర్వాత ఎన్నికలు మరోమారు వాయిదా పడ్డాయి.

# సొంతవారికి సాయపడి గట్టిమేల్ తలపెట్టవోయ్!

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వయంగా లోకేష్ ఓఎస్‌డీ చెప్పారు కాబట్టి ఫలానా వారికే ఈ ర్యాంపులు అప్పగించాలని చూస్తున్నారని, నిజంగా లోకేష్ తరఫున ఫోన్ వచ్చిందా? లేదూ అంటే ఆ పేరు చెప్పి ఇక్కడ అయినవారికి కట్టబెట్టేస్తున్నారా? అనేది ఎవరికీ తెలియడంలేదు. వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళం నియోజకవర్గంలో భైరి, నరసన్నపేట నియోజకవర్గంలో అంధవరం, దుంపాక, ఉప్పరపేట ర్యాంపుల్లో సెమీ మెకానిజంతో ఇసుకను తవ్వడానికి ప్రభుత్వం టెండర్లు పిలిచింది. దీనికి జిల్లాలో ఔత్సాహికులతో పాటు గుంటూరు, విజయవాడలకు చెందిన కొన్ని సంస్థలతో పాటు ఏయూఎన్ కన్‌స్ట్రక్షన్స్, పీఎస్ఎన్ రెడ్డి అండ్ కో, శ్రీ వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ అండ్ మైనింగ్ కంపెనీ, విశ్వసముద్ర వంటి సంస్థలు ఆన్‌లైన్ ద్వారా బిడ్‌లు వేశాయి. ఇందుకు సంబంధించి మంగళవారం ఆన్‌లైన్ బిడ్‌లను కలెక్టరేట్‌లో ఓపెన్ చేశారు. ప్రభుత్వం విధించిన నిబంధనలేమిటి? టెండర్లు వేసినవారికి ఉన్న అర్హతలేమిటి? వంటి పత్రాలను పరిశీలించారు. అనంతరం ఫైనాన్షియల్‌గా బిడ్‌లలో ఎవరు తక్కువకు కోట్ చేస్తే వారికి అగ్రిమెంట్ ఇవ్వాలి. అయితే ఇప్పటికే గోపాలపెంట ర్యాంపులో అక్రమాలకు తెరతీసి ర్యాంపులోకి వెళ్లాలంటే తమ అనుమతి ఉండాలని విలేకరులను సైతం బెదిరిస్తూ ఇష్టారాజ్యంగా తవ్వుకుపోతున్న అభిషేక్ బోరా అనే వ్యక్తికి చెందిన సంస్థ మనుషులు స్థానికంగా భయభ్రాంతులకు గురిచేస్తున్న విషయం మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైంది. ఇప్పుడు ఇదే సంస్థ ఈ నాలుగు ర్యాంపులకు బిడ్‌లు వేయడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపాలపెంట ర్యాంపుపై కథనాలు వచ్చిన వెంటనే కలెక్టర్ ఈ ర్యాంపును రద్దు చేయాలని, సంబంధిత కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లో పెట్టాలని మైన్స్ డీడీని ఆదేశించారు. అయినా కూడా మంగళవారం రాత్రి తెరిచిన టెక్నికల్ బిడ్‌లో ఈ సంస్థ ఉండటంతో కలెక్టర్ ఫైనాన్షియల్ బిడ్ ఖరారును నిలుపుదల చేసి వెళ్లిపోయారు. జిల్లాలో తాత్కాలిక పద్ధతిన ఇచ్చిన ర్యాంపుల్లో మాన్యువల్‌గా తవ్వకాలు జరిపి ఇసుకను ఒడ్డుకు చేర్చాలి. కానీ ఎక్కడా ఇది జరగడంలేదు సరికదా.. ప్రొక్లయినర్లు పెట్టి పెద్దఎత్తున తోడేస్తున్నారు. దీన్ని బహిర్గతం చేసేందుకు వెళుతున్న విలేకరులపై దాడులకు సిద్ధమవుతున్నారు. ఎవర్ని అడిగినా తాము అమరావతి వర్గాలమని, పైస్థాయిలో చూసుకుంటామని చెబుతున్నారు. కొత్తగా మంజూరైన అంధవరం, భైరి, దుంపాక, ఉప్పరపేట ర్యాంపులకు మాత్రమే సెమీ మెకానిజం అనుమతులు ఉంటాయి. అంటే.. చిన్నస్థాయి జేసీబీ పెట్టి ఇసుకను తవ్వుకోవచ్చు. ఎందుకంటే ఈ ర్యాంపులు ఐదు హెక్టార్లకు మించి ఉంటాయి. ఇందుకోసం స్థానికంగా ప్రజాభిప్రాయాన్ని కూడా ప్రభుత్వం తీసుకుంటుంది. నదిలోకి ప్రొక్లయినర్ వెళ్లడానికి అనుమతులు లేనిచోటే ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్న ఇసుకాసురులు ఇప్పుడు సెమీ మెకానిజం ద్వారా ఐదు హెక్టార్లు ఇస్తే పాతాళాన్ని చూపిస్తారనడంలో సందేహం లేదు. జిల్లాలో తవ్వుతున్న ఇసుకకు, ప్రభుత్వ ఖజానాకు వచ్చిన సొమ్ముకు ఏమాత్రం సంబంధం లేదని గత కథనాల్లో చెప్పుకున్నాం. ఆన్‌లైన్‌లో ఒక్క రశీదు లేకుండా ఇల్లీగల్‌గా రూ.8 వేల నుంచి రూ.10వేలకు లారీ లోడును తరలించేస్తున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టి కూడా ప్రభుత్వం అప్రతిష్ఠపాలవుతుంది. కొత్తగా రానున్న 4 ర్యాంపుల్లో భైరిని హౌసింగ్ అవసరాల కోసం, దొంపాకను మూలపేట పోర్టు అవసరాల కోసం కేటాయిస్తారని వినికిడి. ఈ రెండు ర్యాంపులు దక్కించుకుంటే పోర్టు, హౌసింగ్ పేరిట యథేచ్ఛగా ఇసుకను రవాణా చేసేయొచ్చని భావిస్తున్నారు. డీషిల్టేషన్ కింద కాఖండ్యాంలో తవ్వుతున్నవారు కూడా అమరావతి పేరే చెబుతున్నారు. జిల్లాలో ఉన్నవారికి అవకాశాలు లేకుండా సొమ్మంతా అమరావతి వెళ్లిపోతున్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి పాలసీకి, కూటమి ప్రభుత్వ పాలసీకి తేడా ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పీఎస్ఎన్ రెడ్డి అండ్ కో మోడ్రన్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో ఇసుక రీచ్‌లకు వేసిన టెండర్ల వెనుక అభిషేక్ బోరా ఉన్నారని చెప్పుకుంటున్నారు. బోరా పేరుతో ప్రత్యేకంగా సంస్థలు లేకపోయినా ఈ రెండింటి వెనుక ఆయనే ఉన్నారని భోగట్టా. కొత్తగా వచ్చిన సెమీ మెకానిజం ర్యాంపులకు పోర్టు అవసరాల కోసం విశ్వసముద్ర టెండర్ మినహా మిగిలిన కంపెనీలన్నీ గుంటూరుకు చెందినవే కావడం గమనార్హం. అలాగే మైన్స్ డీడీగా పని చేస్తున్న అధికారి కూడా అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు అనుమానాలు పెరిగాయి.



## ఆక్స్‌ఫర్డ్‌లో విత్తన బంతుల తయారీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు విత్తన బంతులు తయారీలో ఉత్సాహంగా నిమగ్నమయ్యారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన రాష్ట్ర వ్యవసాయ విభాగ కో-ఆర్డినేటర్ దార్లపూడి రవి నేతృత్వంలో సుమారు 300 మంది విద్యార్థులు 4500 పైగా నాణ్యమైన విత్తన బంతులను తయారుచేశారు. ఈ నెల 5న ప్రపంచ మట్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత మట్టి తీరు, రకాలు, ప్రయోజనాలు, కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం మీద అవగాహన కలిగించారు. విత్తన బంతులను రానున్న రోజుల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు అడవుల్లోను, చెట్లు లేని ప్రదేశాల్లోను విసురుతారని, వర్షాలు కురిశాక అవి మొక్కలు అయి చెట్లుగా పెరిగేందుకు అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని దార్లపూడి రవి తెలిపారు. సేంద్రియ వ్యవసాయం, ఉత్పతులను ప్రోత్సాహించాల్సిన బాధ్యత విద్యార్థి దశ నుంచే అలవడాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త త్రివిక్రమ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి సురేంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# కౌలురైతులకు అండగా కూటమి ప్రభుత్వం

**- నాబార్డ్ జోనల్ కార్యాలయం ప్రారంభించిన మంత్రి అచ్చెన్న -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కౌలురైతులకు, వ్యవసాయరంగాన్ని లాభసాటిగా ఉండే విధంగా కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నాబార్డ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులందరికీ ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 65 శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారని, వారందరికీ కూటమి ప్రభుత్వం అన్నివిధాల ప్రయోజనం చేకూరే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. వైకాపా ప్రభుత్వం వ్యవసాయ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రైతులకు ప్రయోజనం చేకూరేలా భూసార పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ రంగానికి ఎన్నడూ లేనివిధంగా రూ.45వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా నాబార్డు ప్రాంతీయ కార్యాలయాన్ని విజయవాడలో ప్రారంభించారు. నాబార్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుతో రాష్ట్రంలో నాబార్డు సేవలు మరింత విస్తృతం చేసేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. నాబార్డు ద్వారా రాష్ట్రంలో సహకార వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు ప్రయోజనం కలుగచేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ, సహకార ముఖ్య కార్యదర్శులు బుడితి రాజశేఖర్, అహ్మద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్
- ముందస్తు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రెవెన్యూ సదస్సులకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవిన్యూ అధికారులతో రెవిన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరెట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు హాజరైయ్యారు. జిల్లాలో నిర్వహించనున్న రెవిన్యూ సదస్సుల ఏర్పాట్లుపై రెవిన్యూ మంత్రి సత్యప్రసాద్ ఆరాతీసారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని, అధిక సంఖ్యలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలన్నారు.

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాలో 1464 రెవిన్యూ గ్రామాలున్నాయని, అందులో 738 రీసర్వే పూర్తయిందని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలో జరుగనున్న రెవిన్యూ సదస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే సదస్సులకు సంబంధించి ముందస్తు ప్రచారం నిమిత్తం కరపత్రాలు పంపిణీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపడతామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరెట్ ఎ.ఓ సూర్యనారాయణ, సెక్షన్ అధికారులు సిబ్బంది హాజరయ్యారు.

# విద్యార్థులకు అవగాహన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు సంకల్పం పేరుతో పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని రెండవ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ తెలిపారు. బుధవారం బలగ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులతో సంకల్పం కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రధానంగా మాదకద్రవ్యాల వాడకం వాటి వల్ల కలిగే అనర్థాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు దీనిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, వారి పాత్ర కూడా ముఖ్యమని, పోలీసు వ్యవస్థతో వారూ సహకరించాలని కోరారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఇబ్బంది కలిగించే పరిస్థితి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాజంలో ఇటువంటి వాటిని దూరంగా ఉంచేందుకు అందరు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థితో పాటు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.




## మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో వేగం పెంచాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకర్‌రావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం భైరి గ్రామంలో పర్యటించిన ఆయన గోకులం, సీసీ రహదారుల పనులను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 3303 సిమెంట్ రహదారి పనులు, 437 సిమెంట్ కాంక్రీట్ కాలువల పనులు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధుల ద్వారా మంజూరయ్యాయని, ఇందుకు సంబంధించి రూ.276.54 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. 90 శాతం పైబడి పనులు జరుగుతున్నాయని, మిగిలిన పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతి నాటికి పల్లెల్లో నూతన రహదారులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పీడీ వెంట ఏపీవో సీతారాం, జేఈ పి.బాలముకుందబాబు, టీఏ రత్నాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.